www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...
బుధవారం 13 - 8 - 2025 | సంపుటి : 1 | సంచిక : 36 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్






2లో...

ట్రాఫిక్ ఇబ్బందులకు

## చెక్..

ఫోర్‌లైన్ రోడ్లు రాబోతున్నాయ్
ప్రణాళికలు జరుగుతున్నాయి
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



## ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి

- అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ధారించాలి
- అడవి జంతువుల దాడి బాధితులకు తక్షణ పరిహారం
- అధికారుల ప్రమోషన్లు... అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి..
- అటవీ నిఘా కెమెరాలు ఐసీసీసీతో అనుసంధానం
- అటవీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి...

2లో...



## గణాంకాలతో సిద్ధంగా ఉండండి

ఎన్నికల సంఘానికి సుప్రీం సూచన
బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై
పలు పిటిషన్లు దాఖలు
ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం

2లో...

## రానున్న 72 గంటలు అప్రమత్తంగా ఉండాలి

### అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు...



- లా అండ్ ఆర్డర్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలి
- విద్యుత్, వైద్యారోగ్య, విపత్తు నిర్వహణ సహా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి
- ప్రాణ నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడాలి
- ఐటీ, విద్యా శాఖల అధికారులు పరిస్థితికి తగినట్లు నిర్ణయం తీసుకోవాలి
- భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలకు ప్రత్యేకాధికారుల నియామకం
- మా శాఖ కాదు.. మా పరిధి కాదు అంటే ఊరుకోను - ముఖ్యమంత్రి

2లో...

## దేశవ్యాప్తంగా 'ఓట్ల చోరీ'

కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసీతో కుమ్మక్కైన బీజేపీ
అదే వ్యూహం బిహార్ ఎన్నికల్లో అమలు చేసే ప్రయత్నం
ఒకటి, రెండు కాదు... చాలా సీట్లలో అవకతవకలు జరిగాయి
ఎన్నికల కమిషన్‌కు కూడా ఈ విషయం తెలుసు
నిరూపణకు మా దగ్గర ఇన్ని రోజులు ఎటువంటి ఆధారాలు లేవు
ఇప్పుడు ఆధారాలు మా చేతికి వచ్చాయి
ఈసీపై రాహుల్ విసుర్లు




**విశ్వంభర, ఢిల్లీ:** గతేడాది ఏడాది జరిగిన కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఓటర్లను మోసం చేయడానికి ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కైందని..ఇప్పుడు బిహార్ ఎన్నికల్లో కూడా అదే వ్యూహాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ఆరోపించారు. "ఒకటి, రెండు కాదు... చాలా సీట్లలో అవకతవకలు జరిగాయి. ఇదంతా జాతీయ స్థాయిలో... ఓ క్రమపద్ధతిలో జరుగుతోంది. ఎన్నికల కమిషన్‌కు కూడా ఈ విషయం తెలుసు. దానిని నిరూపించడానికి మా దగ్గర ఇన్ని రోజులు ఎటువంటి ఆధారాలు లేవు. ఇప్పుడు ఆధారాలు మా చేతికి వచ్చాయి. ఇంకా చాలా విషయాలు బయటకు రాబోతున్నాయి. " అంటూ ఈసీని హెచ్చరించారు. ఓట్ల దొంగతనం ఎన్నికల కుంభకోణం మాత్రమే కాదని..ప్రజాస్వామ్యానికి జరిగిన పెద్ద ద్రోహమని రాహుల్ అన్నారు. సమయం వచ్చినప్పుడు ఓట్ల చోరీకి పాల్పడిన వారికి కచ్చితంగా శిక్ష పడుతుందన్నారు. పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు నిరసన చేపట్టిన అనంతరం కాంగ్రెస్ నేత మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యలు చేశారు. స్కాన్ చేసిన ఓటరు జాబితా చిత్రాలను పోస్టు చేయడానికి బదులుగా డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కర్ణాటకలో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఓ నియోజక వర్గంలో సర్వే నిర్వహించగా.. దాదాపు లక్ష నకిలీ ఓట్లు తేలినా ఈ విషయంపై ఎన్నికల సంఘం మౌనం వహిస్తోందని రాహుల్ మండిపడ్డారు. స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షపాత ఎన్నికలను నిర్వహించి.. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ఇలా చేస్తే ఇంకెవరికి ఫిర్యాదు చేయాలని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' దేశవ్యాప్తంగా లోక్‌సభ, శాసనసభ ఎన్నికల సందర్భంగా అనేక నియోజకవర్గాల్లో కొనసాగిందని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని కోరారు.



2లో...

## బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీస్

ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేశారు
కేంద్ర మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారు
రాజకీయ ఉనికి కోసం ఇలా దిగజారి మాట్లాడటం సరికాదు
బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్



## ఏసీబీ అధికారుల దాడులు

మూడు కేసులు నమోదు, నలుగురు అరెస్ట్
మండల సర్వేయర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు అరెస్ట్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఏసీబీ అధికారులు చేపట్టిన దాడులలో ఒకే రోజు మూడు చోట్ల అవినీతి అధికారులు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు జరుపుతున్న దాడులలో ఇటీవల కాలంలో ఒకే రోజులు మూడు, నాలుగు కేసులు నమోదవుతున్నాయి. మంగళవారం ఏసీబీ అధికారులు చేపట్టిన దాడులలో మండల సర్వేయర్ ఇద్దరూ జూనియర్ అసిస్టెంట్స్ పట్టుబడ్డారు. పెద్దపల్లి జిల్లా మండల సర్వేయర్ పైనండ్ల సునీల్ ను క్రిమినల్ మిస్ కండక్ట్ క్రింద ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతనితో పాటు కటుకూరి రాజేందర్ రెడ్డి అనే మరో వ్యక్తి కూడా అదుపులోకి తీసుకున్నారు. సర్వే పంచనామా విషయంలో రూ.10వేలు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు రావడంతో నిఘా పెట్టి పట్టుకున్నారు.మంచిర్యాల జిల్లా అనగారాజ్ పల్లి , కోటపల్లి పిహెచ్‌సీ లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గడియారం శ్రీనివాసులు ఏసీబీకి పట్టుబడ్డారు. డిఏ ఏరియర్స్ బిల్లు సబ్మిట్ చేసేందుకు రూ.6వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. శ్రీనివాసులను అరెస్ట్ చేసి కరీంనగర్ ఏసీబీ స్పెషల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు.వికారాబాద్ జిల్లా కలెక్టరేట్లో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్న కె సుజాత ఏసీబీ అధికారుకుల పట్టుబడ్డారు. భూ సంబంధిత డ్యాక్యుమెంట్ ను నవాబ్ పేట తహసిల్దారు కార్యాలయానికి పంపేందుకు రూ.15వేలు లంచం డిమాండ్ చేసి పట్టుబడ్డారు. సుజాతను అరెస్ట్ చేసి జ్యూడిషియల్ రిమాండ్ కు పంపినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కేసు తదుపరి దర్యాప్తు జరుగుతుందని పేర్కొన్నారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు సిట్‌కు బదిలీ

ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం
అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు : నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్



**విశ్వంభర, హైదరాబాద్:** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసును సిట్‌కు బదిలీ చేసినట్లు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు. జులైలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చెప్పారు. "ఈ కేసులో మొదట 8 మందిని.. తర్వాత 16 మందిని అరెస్టు చేశాం. అరెస్టయిన వారిలో వైద్యులు, ఏజెంట్లు ఉన్నారు. రెండో కేసులో చనిపోయిన బేబీని చూపించి బాధితుల నుంచి రూ.10లక్షలు నుంచి రూ.20లక్షలు వసూలు చేశారు. డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాను నిలిపివేశాం. గైనకాలజీ డాక్టర్ సూరి శ్రీమతి పేరుపై ఉన్న లైసెన్స్ నంబర్, లెటర్ హెడ్స్‌తో అక్రమాలు చేశారు. ఆమె ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదు చేశాం. సికింద్రాబాద్‌లో సృష్టి సెంటర్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్నారు. ఈ సెంటర్‌కు అనుమతులు రద్దయి చాలా కాలమైంది. ధనశ్రీ సంతోషి ప్రధాన ఏజెంట్ కాగా.. మరికొందరిని సబ్ ఏజెంట్లుగా నియమించుకొని నెట్‌వర్క్‌ను విస్తరించారు. విశాఖ నుంచి పిల్లల వైద్యురాలు విద్యుల్లత, వైద్యులు రవి, ఉష పనిచేశారు. ఈ కేసులో సరోగేట్‌గా, అండదానం ఇచ్చే వారిగా కొందరు మహిళా ఏజెంట్లు నటించారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మా వర్కర్స్ కూడా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్నారు. 9 నెలల పూర్తవుతున్న గర్భవతులను గుర్తించి సరోగసీ కోసం వచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు. మగ బిడ్డకు రూ.4.5 లక్షలు, ఆడబిడ్డకు రూ. 3లక్షల ధర నిర్ణయించారు.

## నాగార్జున సాగర్‌కు పెరిగిన వరద..

### 16 గేట్లు ఎత్తి నీటి విడుదల - ప్రస్తుత నీటి మట్టం 589 అడుగులు



విశ్వంభర, నాగార్జున సాగర్: నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర తెరిచి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు 1,77,173 క్యూసెక్కుల వరద వస్తోంది. స్పిల్‌వే ద్వారా 1,28,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రస్తుత నీటి మట్టం 589 అడుగులుగా ఉంది.




## సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు కట్టుదిట్టమైన చర్యలు

నీటిపారుదల శాఖలో ఆధునిక పరిజ్ఞానాన్ని అమల్లోకి తేవాలి
అందుకు అవసరమైన లేటెస్ట్ సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసుకోవాలి
మారుతున్న కాలానికి అనుగుణంగా సీడీఓను బలోపేతం చేయాలి
సీడీఓలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటాం
నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో...

## నెలాఖరులోపు ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ కేసులను పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న శత్రు ఆస్తులపై తక్షణమే సర్వే చేపట్టాలి
అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశం

2లో...

# బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీస్

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు లీగల్ నోటీసు పంపారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసును పంపించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో పేర్కొన్నారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ,ప్రజలలో కేటీఆర్ ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని నోటీసులో ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని న్యాయవాదులు తెలిపారు. టెలిఫోన్ ట్యాపింగ్ ఆరోపణల వలన కేటీఆర్ ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాటు ఆ తర్వాత మంత్రిగా కేటీఆర్ అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించారని అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లైంట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్షాదారాలు లేవని, ఒక పార్లమెంటు సభ్యుడుగా కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడు పైన అసత్యపూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేయడానికి లీగల్ నోటీసులు న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారనినోటీసులో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో,కేటీఆర్ తరపున బండి సంజయ్ కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, కేటీఆర్ మరియు అతని కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎటువంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీసులో డిమాండ్ చేశారు. నోటీసు అందిన ఏడు రోజులలోగా ఈ డిమాండ్లను పాటించనిపక్షంలో,చట్టపరంగా సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణల వల్ల కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో పేర్కొన్నారు.

# ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సీఎం సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూను ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు.

అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు.

అటవీ శాఖలో అధికారుల కొరతపైనా సీఎం ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు.

అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సీఎం సూచించారు.

సమీక్షలో రాష్ట్ర అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేములశ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ,పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్..



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో ప్రజలకు, వాహనాదారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క గుడ్‌న్యూస్ చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు భవిష్యత్తులో ఫోర్‌లైన్ రోడ్లకు ప్రణాళికలు జరుగుతున్నాయని భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం హైదరాబాద్ హైటెక్స్ న్యాక్ లో ఆర్%అ%బీ, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యామ్ రోడ్లకు సంబంధించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..

రాష్ట్రంలో రహదారులు నాగరికతకు ప్రతీకలు, పరిశ్రమల అభివృద్ధికి బాటలు, ఉపాధి అవకాశాల సృష్టికి పునాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వ ంలోని మా ప్రభుత్వం రహదారుల అభివృద్ధి విషయంలో అచంచలమైన కట్టుబాటుతో ముందుకు సాగుతోందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 17 ప్యాకేజీల్లో 7,947 కిలోమీటర్ల రోడ్లు, రోడ్లు అండ్ భవనాల శాఖ ద్వారా 17 ప్యాకేజీలలో 5,190 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రూ.1.75 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ఒప్పందాలు చేసుకుని, రూ. 45 వేల కోట్ల విలువైన పనులకు టోకెన్లు జారీ చేసి, వాటి బకాయిల భారాన్ని రాష్ట్ర ప్రజల భుజాలపై వేసి వెళ్లిందన్నారు. హ్యామ్ రోడ్లకు ప్రభుత్వ వాటా 40 శాతం నిధుల సమీకరణ క్రమంలో కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి పథంలో 'తెలంగాణ రైజింగ్' లో భాగస్వాములు కావాలని కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

# సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు కట్టుదిట్టమైన చర్యలు

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** నీటిపారుదల శాఖలో ఆధునిక పరిజ్ఞానాన్ని అమల్లోకి తేవాలని.. సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సెక్రటేరియట్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడిగడ్డ ఉదంతంలో జాతీయ భద్రత సంస్థతోపాటు జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన వ్యాఖ్యలతో సీడీఓ ప్రతిష్ట దెబ్బతిన్నదని అన్నారు. అటువంటి వ్యాఖ్యలపై సీడీఓ పునఃసమీక్షించుకుని సంస్కరణలు చేపట్టడం అత్యవస రమని సూచించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సీడీఓను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రాజెక్టుల డిజైన్ల రూపకల్పనలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

అందుకు అవసరమైన లేటెస్ట్ సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒకప్పుడు సీడీఓ ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు యావత్ భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి మొదలు పెడితే ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిర్మించిన ప్రధాన ప్రాజెక్ట్ నిర్మాణాలలో వినియోగించిన సాంకేతికత తెలంగాణ సీడీఓ ప్రతిభకు పట్టం కడుతుందన్నారు. అటువంటి ప్రతిభ చాటేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే.. సీడీఓలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐఐటీలు, ఎన్ఐటీ నుంచి నీటిపారుదల శాఖలో నియమితులైన ఇంజినీర్లకు సీడీఓలో పోస్టింగ్ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నవి కావడంతో ప్రతిభావంతులైన ఇంజినీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్దిష్టమైన ఇంజినీరింగ్, సృజనాత్మక అవసరమని.. అది అత్యుత్తమ శిక్షణ పొందిన నిపుణుల ద్వారానే సాధ్యపడుతుందని చెప్పారు. పదవీ విరమణ పొందిన అనుభవం కలిగిన వారి సేవలు కుడా వినియోగించుకుని అద్భుతమైన ఫలితాలు రాబట్టాలన్నారు.

**నెల్లికల్లు, డిండి డిజైన్లు ఫైనల్ చేయాలి..**

నీటిపారుదల శాఖ చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలక్ట్రోమెకానికల్ ఇంజినీరింగ్ ప్రాముఖ్యత మునుముందు మరింత పెరగబోతున్నదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. దాంతో లోతైన పరిజ్ఞానం కలిగి ఉన్న నిపుణులను నియమించడం ద్వారా సీడీఓ తిరిగి పూర్వవైభవం చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఐఐటీ హైదరాబాద్, జేఎన్టీయూ, టీఎస్ జెన్ కో వంటి సంస్థలకు చెందిన వారిని నియమించే ముందు టైంబౌండ్ పద్ధతిలో డిజైన్ల రూపకల్పనలో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతోపాటు సమయపాలనకు పెద్దపీట వేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో నెల్లికల్లు, డిండి ఎత్తిపోతల పథకాల డిజైన్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆలస్యం అయ్యే కొద్దీ రైతులకు నీరు అందించడంలో జాప్యం జరుగుతుందని చెప్పారు.

# నెలాఖరులోపు ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ కేసులను పరిష్కరించాలి

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో :** స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కేసులను ఈనెలాఖరు లోపు పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీస్) సమస్యలను పరిష్కరించేందుకు సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఎనిమీ ప్రాపర్టీస్ విక్రయాల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న మిగిలిన పెన్షన్ దరఖాస్తులను సైతం వేగవంతం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుండి అవసరమైన పత్రాలు అందకపోవడంతో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెప్పడంతో వెంటనే రాష్ట్రాలకు లేఖలు పంపాలని స్వాతంత్ర సమరయోధులు, పునరావాస విభాగం జాయింట్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుండి పత్రాలను సేకరించి, పెన్షన్ మంజూరును వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలను రాష్ట్రాలకు పంపాలని కోరారు. శత్రు ఆస్తుల విషయంలో ఉన్న వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత విభాగం అధికారులకు సూచించారు. అందులో భాగంగా యుద్ధ ప్రాతిపదికన సర్వే, సరిహద్దు నిర్ధారణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

# గణాంకాలతో సిద్ధంగా ఉండండి

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. విచారణ క్రమంలో ఆర్జేడీ నేతమనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ పేర్కొందని, కానీ వారు సజీవంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో.. బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. అయితే.. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని.. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ధర్మాసనం సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య? ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బిహార్ ఎస్ఐఆర్ ప్రక్రియలో 7.9కోట్లమంది ఓటర్లలో 7.24 కోట్ల మంది పత్రాలు సమర్పించారని.. కోటిమంది ఓటర్లు గల్లంతయ్యారనే ఆరోపణలకు ఇది తెరదించుతోందని పేర్కొంది. అదేవిధంగా.. ఎస్ఐఆర్ ప్రక్రియలో పౌరసత్వానికి రుజువుగా ఆధార్, ఓటరు కార్డులను అంగీకరించకూడదనే ఈసీ నిర్ణయంతో ఏకీభవించింది. బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే.

# రానున్న 72 గంటలు అప్రమత్తంగా ఉండాలి




మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** ఎంతటి భారీ వర్షాలు వచ్చినా ప్రాణ నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు కాజ్‌వేలు, ఉద్ధృతంగా ప్రవహించే నదులు, వాగులు, వంకలపై వంతెనలపై నుంచి రాకపోకలు లేకుండా చూడాలని సీఎం సూచించారు. పశువులు, గొర్రెలు, మేకల కాపర్లు తరచూ వాగుల్లో చిక్కుకొనిపోతున్నారని.. ఈ విషయంలో ముందస్తుగా వారిని అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. ఎక్కడైనా ప్రమాదవశాత్తూ చిక్కుకుంటే వారిని తక్షణమే బయటకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదే సమయంలో పశు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. రానున్న 72 గంటల్లో తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అతి భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు ఉన్న జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం సూచించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని... అంతా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని సీఎం ఆదేశించారు. రెండు రోజుల్లో ఎంత వర్షపాతం వస్తుంది..ఎలా ఎదుర్కోవాలనే దానిపై మనకు మాన్యువల్స్ ఉన్నాయని... కానీ వాతావరణ మార్పులతో రెండు గంటల్లోనే రెండు నెలల వర్షపాతం కురుస్తోందని... క్లౌడ్ బస్టర్స్‌తో ఊహించనంత నష్టం వాటిల్లుతోందని సీఎం తెలిపారు. క్లౌడ్ బస్టర్ పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఊహించనంత వర్షపాతంతో గతంలో ఖమ్మం, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రాణ నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని.. అటువంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కావడానికి వీల్లేదని సీఎం అన్నారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లోపై పూర్తి అవగాహనతో ఉండాలని నీటి పారుదల శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. జల విద్యుత్ తయారీపైనా దృష్టి సారించాలని, అదే సమయంలో నీటి విడుదలపై పూర్తి సమాచారం లోతట్టు ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలన్నారు. చెరువులు, కుంటలు కట్టల తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధి కారులు, సిబ్బంది 24/7 అందు బా టులో ఉండాలని సీఎం రేవం త్ రెడ్డి ఆదేశించారు. మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు , విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి సిద్దంగా ఉంచాలన్నారు. సమస్య ఎక్కడ తలెత్తినా తక్షణమే పరిష్కరించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని...



పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో అవసరమైన మందులు ఉంచాలని, గర్భిణులను తక్షణమే తరలించేలా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. అన్ని పట్టణాల్లో లోతట్టు ప్రదేశాల నుంచి ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని... వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు.. .పిడుగుపాట్లతో పశువులు, మేకలు, గొర్రెలు చనిపోయినప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించి బాధితులకు పరిహారం అందేలా చూడాలని పశుసంవర్ధక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

**హైదరాబాద్ నగరంలో..**

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్‌లు సమన్వయంతో పని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీస్,ఎంఏయూడీ..ప్రతి విభాగం సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు. ఐటీ, విద్యా శాఖ ఉన్నతాధికారులు పరిస్థితిపై సమీక్షించి వర్క్ ఫ్రం హోం.. సెలవుల విషయమై నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. హైడ్రా, విపత్తు నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం సూచించారు.. హైడ్రా టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలని..ప్రజల నుంచి వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు సైతం ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగస్వాములు కావాలని సీఎం సూచించారు.

వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు అందజేయాలని.. అదే సమయంలో భయానక వాతావరణం సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓవైపు యుద్ధ హెచ్చరికలు..
# మరోవైపు నీటి కోసం అభ్యర్థనలు

విశ్వంభర, ఇస్లామాబాద్: భారత్‌పై పాక్ ఉగ్రవాదులు దాడుల నేపథ్యంలో పాకిస్థాన్ కు సింధూ జలాలను ఆపేస్తూ.. భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఓ వైపు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మాజీ మంత్రి బిలావల్ భుట్టో బెదిరింపులకు పాల్పడుతుండగా..మరోవైపు తమకు నీటిని విడుదల చేయాలని ఆ దేశ విదేశాంగ శాఖ భారత్‌ను వేడుకుంటోంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌కు నిలిపివేసిన సింధూ జలాల సరఫరాను తిరిగి పునరుద్ధరించాలని ఆ దేశ విదేశాంగ శాఖ తాజాగా న్యూదిల్లీని కోరింది. ఈ ఒప్పందాన్ని నమ్మకంగా, న్యాయబద్ధంగా కొనసాగించాలని కోరుతున్నట్లు తెలిపింది.మరోవైపు పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ భారత్‌పై అణు హెచ్చరికలు చేస్తూ.. నోరు పారేసుకుంటున్నారు. 'భారత్ అనేది హైవేపై వస్తున్న ఒక మెర్సిడెస్ కారులాంటిది. కానీ.. పాకిస్థాన్ మాత్రం కంకరతో నిండిన ఓ డంప్ లారీలాంటిది. ఒకవేళ కారు వచ్చి లారీని ఢీకొంటే ఎవరికి నష్టం?" అని మునీర్ తన ప్రసంగంలో పేర్కొన్నట్లు జాతీయ మీడియాలో సోమవారం కథనాలు వచ్చాయి. ఆ దేశ విదేశాంగశాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సైతం భారత్‌పై పిరికిపంద ప్రేలాపనలు చేశారు. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత కొనసాగితే.. యుద్ధం గురించి ఆలోచించడం తప్ప మరో మార్గం లేదని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు. ఈ నేపథ్యంలో నీటిని విడుదల చేయాలని భారత్‌ను, పాక్ విదేశాంగ శాఖ అభ్యర్థించడం గమనార్హం. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పం



దం (Indus Waters Treaty) కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూదిల్లీ నిలిపివేయడంతో దాయాది దేశానికి నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. జలాశయాల్లో నీటిమట్టం దారుణంగా పడిపోయింది. ఇక వాటినుంచి నీటిని తీసుకోలేని స్థితి ఎదురవుతోంది. గతేడాదితో పోలిస్తే సింధు బేసిన్‌లో నీటి ప్రవాహం 15 శాతం తగ్గింది. వేసవిలో పంటలు ఎండి కష్టాల్లో పడిన రైతులకు ఖరీఫ్‌లో మరిన్ని కష్టాలు తప్పవని నిపుణులు చెబుతున్నారు. భారత్ నిర్ణయంతో 21 శాతం నీటి కొరత ఏర్పడుతుందని పాక్ అంచనా వేసింది. అయితే ఉగ్రవాదంపై పాక్ తీరు మారే వరకూ ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ ఇప్పటికే పలుమార్లు స్పష్టంచేసింది.

## శిక్షాకాలం పూర్తయిన ఖైదీలను
# తక్షణమే విడుదల చేయండి: సుప్రీం



విశ్వంభర, నేషనల్ బ్యూరో: వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. నిర్ణీత శిక్ష పూర్తి చేసుకొని మరే ఇతర కేసులో దోషిగా లేదా నిందితులుగాలేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. 2002లో దిల్లీలో నితీశ్ కటారా అనే వ్యాపారవేత్త హత్య కేసులో దోషిగా తేలిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ శిక్షాకాలం పూర్తయినందున అతడిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలు ఇంకా జైల్లోనే ఉండటంపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు.. ఇదే వైఖరి కొనసాగితే దోషి జైల్లోనే మరణిస్తాడని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పహిల్వాన్‌ను ఇంకా జైల్లోనే ఉంచడంపై ప్రశ్నించిన ధర్మాసనం.. ఆయనతో సహా నిర్ణీత జైలు శిక్ష పూర్తయిన దోషులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గడువుకు మించి ఇంకా ఎవరైనా దోషులు లేదా నిందితులు జైల్లోనే ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకోవాలని, తాజా తీర్పు కాపీలను అన్ని రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది.ఢిల్లీలో 2002లో చోటుచేసుకున్న ఓ పరువుహత్య అప్పట్లో సంచలనం రేపింది. నితీశ్ కటారాను పెళ్లి మండపం నుంచే కిడ్నాప్ చేసిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ బృందం అతడిని హత్య చేశారు. ఈ కేసులో సుఖ్‌దేవ్‌కు జీవితఖైదు పడింది. 2015లో ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు.. శిక్ష తగ్గింపు లేకుండా 20 ఏళ్లపాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చితో శిక్షాకాలం పూర్తికావడంతో తనను విడుదల చేయాలంటూ సుఖ్‌దేవ్ సుప్రీంను ఆశ్రయించాడు.విచారించిన సుప్రీం ధర్మాసనం సుఖ్‌దేవ్ పహిల్వాన్ అలియాస్ సుఖ్‌దేవ్ యాదవ్‌ను విడుదల చేయాలని జులై 29నే అదేశించింది. అయితే, అతడి ప్రవర్తనను విశ్లేషించిన శిక్షా సమీక్ష బోర్డు విడుదల చేసేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. 20ఏళ్ల పూర్తయినందున పహిల్వాన్ విడుదల సాధ్యం కాదని, శిక్ష తగ్గించాలన్న అభ్యర్థనను ప్రభుత్వం అనుమతించినప్పుడే జైలు నుంచి బయటకు రాగలడని దిల్లీ ప్రభుత్వం చేసిన వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది.

# విమానం దారిమళ్లింపు ఘటన..

లోక్‌సభ స్పీకర్‌కు ఎంపీల ఫిర్యాదు:విశ్వంభర, నేషనల్ బ్యూరో: తాము ప్రయాణిస్తున్న తిరువనంతపురం- ఢిల్లీ ఎయిరిండియా విమానాన్ని చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. సదరు విమానయాన సంస్థ తమ హక్కుల ఉల్లంఘనకు పాల్పడిందని ఆరోపించారు. ఈ క్రమంలోనే దానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌కు చెందిన కేసీ వేణుగోపాల్ సహా ఐదుగురు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కోరారు.పార్లమెంట్ సభ్యులు కేసీ వేణుగోపాల్, కొడికున్నిల్ సురేశ్, ఆదూర్ ప్రకాశ్, కె.రాధాకృష్ణన్, సి.రాబర్ట్ బ్రూస్ సహా 150 మంది ప్రయాణికులతో కూడిన ఎయిరిండియా విమానం ఈ నెల 10న తిరువనంతపురం నుంచి దిల్లీకి బయల్దేరింది. మార్గమధ్యంలో సాంకేతిక లోపం కారణంగా విమానాన్ని చెన్నైకి మళ్లించారు. ఆ సమయంలో బెంగళూరు, కోయంబత్తూరు వంటి ఇతర విమానాశ్రయాలు సమీపంలోనే ఉండగా.. చెన్నైకు మళ్లించడాన్ని ఎంపీలు ప్రశ్నించారు. ఈ నిర్ణయం వెనుక కారణాన్ని సంస్థ వివరించలేదన్నారు.విమానాన్ని చెన్నైకు మళ్లించినప్పటికీ.. నేరుగా ల్యాండ్ చేయలేదని, అక్కడే గంటకుపైగా చక్కర్లు కొట్టినట్లు ఎంపీలు తెలిపారు. తొలిసారి ల్యాండింగ్‌కు విఫలయత్నం చేశారని.. బహుశా రన్‌వేపై మరో విమానం ఉండటం వల్ల కావచ్చనే పైలట్ ప్రకటనను ఉటంకించారు. ఎట్టకేలకు అర్ధరాత్రి దాటిన తర్వాత మరో విమానంలో దిల్లీకి వెళ్లినట్లు చెప్పారు.




ఈ వ్యవహారంపై తాము ఆందోళనలు లేవనెత్తగా.. తప్పుడు ప్రకటనలు చేశామంటూ ఎయిరిండియా చిత్రీకరించిందన్నారు. తద్వారా ఎంపీల ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం నుంచి దేశం ఇంకా తేరుకోలేదని, కొన్ని నెలలుగా అనేక సాంకేతిక లోపాల ఘటనలు నమోదవుతున్న తరుణంలో.. ఎయిరిండియా తీరు ఆమోదయోగ్యం కాదని కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు రాసిన లేఖలో ఎంపీలు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. అత్యవసర మళ్లింపులు, రన్‌వే భద్రతకు సంబంధించిన ప్రోటోకాల్‌లను మరింత బలోపేతం చేయాలని, అటువంటి పరిస్థితుల్లో ప్రయాణికులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## వామనరావు దంపతుల
# మర్డర్ కేసు సీబీఐ చేతికి



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన అడ్వకేట్ దంపతులు గట్టు వామనరావు, గట్టు నాగమణి హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. పెద్దపల్లి జిల్లా మంథనిలో 2021 ఫిబ్రవరి 17న వామనరావు, నాగమణి కారులో వెళ్తుండగా అడ్డగించి నడిరోడ్డుపై కొందరు దుండగులు దారుణంగా హత్య చేశారు. ఈ హత్య కేసు దర్యాప్తును సీబీఐకి ఇవ్వాలని వామనరావు తండ్రి గట్టు కిషన్ రావు అదే ఏడాది సెప్టెంబర్ 18న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ కేసుకు సంబంధించిన వీడియోలు సహా అన్ని పత్రాలు తమ ముందు ఉంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని గతంలో ఆదేశించింది. రికార్డులను పరిశీలించి సీబీఐ విచారణపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సంబంధిత వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు సమర్పించింది. చనిపోయే ముందు వామనరావు మాట్లాడిన మరణ వాంగ్మూలం వీడియో వైరల్ అయింది. దీనిపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఎఫ్ఎస్ఎల్ కు పంపించారు. వామనరావు మరణ వాంగ్మూలం వీడియో అసలుదేనని ఎఫ్ఎస్ఎల్ నివేదిక తేల్చిందని ఇందుకు సంబంధించిన నివేదికను సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు ఇస్తే తమకేమి అభ్యంతరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేస్తూ ఇవాళ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. వామనరావు తండ్రి కిషన్ రావుకు భద్రత కల్పించాలని ఆదేశించింది.

## నాకు పదవులు ముఖ్యం కాదు..
# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మరో సంచలనం

విశ్వంభర, మునుగోడు : తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండగా 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్లగొండ జిల్లాకు ముగ్గురు మంత్రులను కేటాయిస్తే తప్పేముందని.. 'ఖమ్మంకు ఒప్పు.. నల్లగొండకు తప్పా' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెం గ్రామంలో 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నన్ను పార్టీలోకి ఆహ్వానించినప్పుడు తెలవదా? మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని, అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమేనని, ఇద్దరం గట్టి వాళ్లమేనని, మా ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో కూడా మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చి, పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించిన తర్వాత ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. నాకు అవమానం జరిగినా పర్వాలేదని మునుగోడు ప్రాంత ప్రజలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం జరిగితే రాజగోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టె భావిస్తాను అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎర్రజెండా నాయకులు తన పోరాటానికి మద్దతు నిలవాలన్నారు. మీరు మాటిచ్చారు ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటి వరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి నిధులు విడుదల చేయాలని, ఒక్క రూపాయి కూడా ఆపొద్దని ప్రభుత్వాన్ని కోరారు. నాకు పదవులు ముఖ్యం కాదని ఈ ప్రాంత అభివృద్ధి లక్ష్యమన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందాలన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు పార్టీలని ఎన్నికలు అయిపోయాక అన్ని పార్టీల నాయకులు తన దృష్టిలో ఒక్కటేనన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకుల గొంతునొక్కేందుకు బెదిరించి తమ



పార్టీలోకి చేర్చుకునేవారన్నారు. అందులో భాగంగానే కాంగ్రెస్ 12 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ లో చేర్చుకున్నారన్నారు. వారిలాగా నేను చేయను అని జెండా ఏదైనా ఈ ప్రాంత సంక్షేమమే ఎజెండా అన్నారు. భువనగిరి పార్లమెంట్ నుంచి ఎంపీగా పని చేశానని, నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశానని, నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉందన్నారు. ప్రభుత్వ దవాఖానకు పోతే పేదవాడికి న్యాయం జరగాలని, ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు పాఠశాలలు పేదవాడి రక్తం తాగుతున్నాయన్నారు. పేదవాళ్లకు అండగా ఉండాలని నేను కష్టపడుతున్నారు. ఆ భగవంతుడు ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే కానీ నా కోసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, దోటి నారాయణ, పీఆర్ డీఈ నాగేశ్వరావు, ఏఈ సతీష్, మాజీ సర్పంచ్ సురిగి చలపతి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ వైస్ ఎంపీపీ అనంత వీణ స్వామి గౌడ్, వివిధ పార్టీల నాయకులు బూడిద లింగయ్య యాదవ్, జాల వెంకన్న, వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, తీర్పారి వెంకటేశ్వర్లు, గురిజ రామచంద్రం, పాల్వాయి చెన్నారెడ్డి, మేకల మల్లయ్య, పాల్వాయి జితేందర్ రెడ్డి, రాము, జక్కలి శ్రీను, పోలగోని ప్రకాష్, నకరకంటి యాదయ్య, లాల్, ఎండి అన్వర్, తాటికొండ సైదులు,ఆరేళ్ల సైదులు, మేకల శ్రీనివాస్ రెడ్డి, మేకల సంతోష్ రెడ్డి, మాధగోని రిషి, కాంగ్రెస్, సీపీఐ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రోకు మరోసారి నిరాశ

విశ్వంభర, హైదరాబాద్: కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి మొండిచేయి చూపించింది. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు, ఆ పార్టీ మిత్రపక్షాల పార్టీలకు మాత్రమే తాయిళాలు అందిస్తూ, ఇండియా కూటమి రాష్ట్రాలకు ఎలాంటి ప్రాజెక్టులు ఇవ్వడం లేదు. తాజాగా మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ లో తీసుకున్న నిర్ణయాలు అందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఏపీ, ఒడిశా, మహారాష్ట్ర, ఢిల్లీలలోని పలు ప్రాజెక్టులకు అనుమతులిస్తూ, కొత్త ప్రాజెక్టులను కూడా వాటికి కట్టబెట్టింది. ఏపీ, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలకు రూ.4594 కోట్లతో సెమీ కండక్టర్ల పరిశ్రమలు మంజూరు చేసింది. అలాగే రూ.5,801 కోట్లతో చేపట్టే లక్నో మెట్రో ఫేజ్-1 కు కూడా అనుమతులు ఇచ్చింది. అయితే మెట్రో అనుమతులపై తెలంగాణ రాష్ట్రానికి మరోసారి నిరాశే ఎదురైంది. హైదరాబాద్ మెట్రో 2వ దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వడానికి మొండికేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ మంత్రులు ఎన్నిసార్లు కేంద్రానికి వినతిపత్రాలు సమర్పించినా పెడచెవిన పెడుతోంది. గత ప్రభుత్వ హయాంలో



కూడా మెట్రో 2nd ఫేజ్ పనులకు అనుమతి ఇవ్వాలని ఎన్నోసార్లు కేంద్రానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. కాని ఇటీవలి కాలంలో ఏపీ మెట్రోకు, తాజాగా నేడు లక్నో మెట్రోకు కూడా అనుమతులు మంజూరు చేయడం వంటివి కావాలనే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను కేంద్రం పక్కన పెడుతున్నట్టు తెలుస్తోంది.

# సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ (ఎం.ఎల్) నేతల భేటీ



విశ్వంభర, హైదరాబాద్: ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగా రావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కట్ట రమ, కే. సూర్యం బృందం రేవంత్ రెడ్డిని కలిశారు. పోడుసాగుదారులకు పట్టాలు ఇవ్వాలని పోడు రైతులపంటలను ధ్వంసం చేస్తున్న ఫారెస్ట్ అధి కారుల దౌర్జన్యాలను ఆపాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయడంతో పాటు క్యాజువల్ కార్మికుల బేసిక్ రూ. 18 వేల వేతనం ఇవ్వాలని కోరారు. నారాయణపేట, కొడంగల్ ప్రాజెక్టు భూనిర్వా సితులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని నిర్వాసిత ప్యాకేజీని 28 లక్షలు ఇవ్వాలన్నారు. సీతారామ ప్రాజెక్టును ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ ప్రాంతానికి పొడిగిచాలనే డిమాండ్ తో పాటు 27 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని సీఎంకు అందజేశారు. మంత్రులు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు వామపక్ష పార్టీ నాయకులను అప్రజాస్వామికంగా ముందస్తు అరెస్టులు చేస్తున్నారని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. కేసీఆర్ పాలనలో కొనసాగిన ఈ విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం శోచనీయమన్నారు.

# భద్రాచలం ఆలయానికి ఐఎస్‌వో గుర్తింపు

విశ్వంభర, భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి ఐఎస్ఓ గుర్తింపు లభించింది. 19001 ప్రమాణ స్థాయిలను పాటించేటటువంటి 22000 ఆహార భద్రత నిర్వహణ స్థాయి పాటించే గుర్తింపు లభించింది. దీనిని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతులు మీదుగా దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎల్ రమాదేవి అందుకున్నారు. ఈ సర్టిఫికెట్‌ను ఐఎస్ఓ డైరెక్టర్ శివయ్య అందించారు. కాగా, ఐఎస్‌వో అంటే ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్. ఒక సంస్థ లేదా ఉత్పత్తి నాణ్యత, భద్రత, మరియు సామర్థ్యాన్ని ధృవీకరించే ఒక గుర్తింపు సంస్థ. ఇది ఒక సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తుందని సూచిస్తుంది.





# వరద నీటిలో ఆగిపోయిన స్కూల్ బస్సు..
# విద్యార్థులకు తప్పిన ప్రమాదం

విశ్వంభర, నారాయణపేట: నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కర్ని చెరువు నిండి అలుగు పారుతోంది. మక్తల్ నుంచి అనుగొండకు వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో దాదాపు పది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ప్రవాహాన్ని దాటుతుండగా ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు నీటిలో ఆగిపోయింది. గమనించిన స్థానికులు వెంటనే బస్సును ముందుకు తోసి ఒడ్డుకు చేర్చారు. దీంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది.



# వైద్యంలో పెడధోరణులపై కరవాలం

## గర్భసంచిని కాపాడుకుందాం..సమాజాన్ని బలపరుద్దాం పుస్తకం






డాక్టర్ సామవేదం వేంకట కామేశ్వరి. సామాజిక స్పృహ కలిగిన వైద్యురాలు. వ్యాపారాత్మక ధోరణికి భిన్నంగా సేవే పరమావధిగా వైద్యం చేస్తుంటారు. ఇప్పటివరకు 25 వేల మందికి పైగా సంతాన సాఫల్యం కలి గించారు. అత్యంత సాధారణంగా కనిపిస్తూ అసాధారణ సేవలు అందిస్తున్నారు. తన భర్త డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్ తో కలిసి స్థాపించిన స్వచ్ఛంద సంస్థ లైఫ్ హెచ్ ఆర్ జి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు. సంతాన సాఫల్యం అనేది డబ్బులు సంపాదించి పెట్టే వ్యవహారంగా మారినప్పటికీ డాక్టర్ కామేశ్వరి ఆ బాటపట్టలేదు సరికదా ఆ ధోరణికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. మహిళలకు లేనిపోని భయాలు కల్పించి అనసరంగా గర్భసంచులను తొలగిస్తున్న వైనం చూసి కలత చెందారు. ఆవేదన చెందారు. ఈ కమ ర్షియల్ ప్రపంచంలో మనమేం చేయగలమని ఊరుకోకుండా ఓ పెద్ద ఉద్యమమే చేశారు. సాటి వైద్యులు, ఆస్పత్రుల వైఖరికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. మహిళ్లలో చైతన్యానికి, అవగాహనకు సొంత ఖర్చులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించేలా చేశారు. చేస్తున్నారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని వారు భావిస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. అందులో భాగంగానే డాక్టర్ సామవేదం వేంకట కామేశ్వరి గారు 'గర్భసంచిని కాపాడుకుందాం..సమాజాన్ని బలపరుద్దాం' అనే పుస్తకాన్ని వెలువరించారు. దానిపై కవులు, రచయితలు, జర్నలిస్టులు, మేధావులతో మేధోమథన చర్చావేదిక నిర్వహించారు.

### ప్రతి అక్షరంలో ఆవేదన..

డాక్టర్ వేంకట కామేశ్వరి , డాక్టర్ వింజమూరి సూర్యప్రకాశ్ దంపతులు లైఫ్ హెచ్ ఆర్ జీ స్వచ్ఛంద సంస్థ ద్వారా గర్భసంచిని కాపాడుకుందాం.. సమాజాన్ని బలపరుద్దాం పుస్తకాన్ని ప్రచురించారు. 2017లో మొదటి ముద్రణ చేయగా ఇటీవల రెండో ముద్రణచేశారు. ఈ పుస్తకంలోని ప్రతి అక్షరంలోనూ సమాజం పట్ల ఆర్తి కనబడుతుంది. మహిళల ప ట్లప్రేమ, సహానుభూతి కనిపిస్తాయి. సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదేమనే ఆవేదన కనబడుతుంది. వాటిని పరిష్కరించాలన్న బాధ్యత తమదే కదా అన్నభావన కనపడుతుంది. ఈ అంశాన్నిఇలా వదలకూడదు. రండి...మాతో చేతులు కలపండి అనే పిలుపు వినబడుతుంది. తెలిసీ తెలియకుండా వైద్యం చేయడం తగదని ఈ పుస్తకం హితవు పలుకుతుంది. మన శరీరంపై మనకు అవగాహన ఉండాలి. శరీరంలోని ప్రతి అవయవానికి ఒక ప్రత్యేకత ఉంది. ఒక్కో అవసరం ఉంది. అన్నింటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంది అని తెలియజెప్తుంది. ఇది మహిళల ఆరోగ్యానికి కరదీపిక. వైద్యంలో పెడధోరణులపై కరవాలం. అలాగే ఇది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతను గుర్తుచేసే దిక్సూచి అని చెప్పుకోవచ్చు.

### విజ్ఞాన సర్వస్వం..

గర్భసంచిని కాపాడుకుందాం..సమాజాన్ని బలపరుద్దాం అనే పుస్తకం ఒక విజ్ఞాన సర్వసం. సాంకేతిక పరమైన, వైద్యపరమైన అంశాలను సాధారణ వ్యక్తులకు అర్థమయ్యేలా వివరించిన తీరు అద్భుతం. మన ఎదురుగా కూర్చుని మాట్లాడినట్లు, నచ్చజెప్పినట్లు ఉంటుంది. పాఠకుడికి సందేహం వస్తుందేమో అనిపించిన చోట.. అక్కడే సమాధానం దొరికేలా అర్థమయ్యేలా వివరించిన తీరు ప్రశంసనీయం. సాధారణ పరిభాషలో చెప్పడమే కాకుం డా అదనపు సమాచారం కోసం రెఫరెన్స్‌లను కూడా పొందుపర్చడం ముందు చూపునకు నిదర్శనం. ఒక మాస్టారు పాఠం చెప్పినట్లు, చేయితిరిగిన ఒక జర్నలిస్ట్ కథనం రాసినట్టు..అరటిపండు ఒలిచినట్లు రాయడం ఈ పుస్తకం ప్రత్యేకత. అవసరమైన ప్రతి చోటా బొమ్మలను వినియోగించడం, వాటిని అర్థం చేయించడానికి వివరణ ఇవ్వడం విశేషం. ఒక విషయాన్ని వివరించినప్పుడు దానికి ఆధారాలు చూపడం ద్వారా నిజాయితీని ప్రదర్శించారు. మేము చెప్పేది అబద్ధం కాదు...ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకున్నాకే మీ ముందుకు తీసుకువస్తున్నాం. ఇది విశ్వసించదగిన సమాచారం అని చెప్పకనే చెప్పారు. ఒక జర్నలిస్ట్ పరిశోధనాత్మక కథనం రాసినప్పుడు దానిని నిరూపించేందుకు ఎన్నో ఆధారాలు సేకరిస్తాడు. అది వాస్తవమని పాఠకుడు నమ్మడానికి కొన్నిఆధారాలను అందులో పేర్కొంటాడు. బాధ్యత గల జర్నలిస్ట్ సమాజంలోని అనేక అవినీతి వ్యవహా రాలను సాధికారికంగా బయటపెట్టినట్లు డాక్టర్ కామేశ్వరి గారు ఈ పుస్తకాన్ని రచించారు. వైద్యరంగంలో కొనసాగుతున్నపెడధోరణుల కారణం గా అమాయక మహిళలు గర్భసంచులను కోల్పోయి జీవితాలను నిస్సారం చేసుకుంటున్నవైనంపై తన ఆవేదన వెలిబుచ్చారు.

### వేలాది మందితో మాట్లాడి..

ఈ పుస్తకం ఏదో ఉబుసుపోక...అల్లాటప్పాగా రాసింది కాదు. చదువుకున్నచదువు, వృత్తిలో భాగంగా మహిళలతో చేసిన సంభాషణ, సమాజంలో వేలాది మందిని కలిసినప్పుడు తెలుసుకున్న విషయాలు, జరుగుతున్న పరిణామాలపై నిరంతర పరిశీలన...అన్నింటిని మేళవించి రాసిన పుస్తకమిది. వృత్తిని గౌరవిస్తూ....అందుకు తగిన సమయమిస్తూ దాదాపు పాతికవేల మందికి సంతాన సాఫల్యం కల్పించిన చరిత్ర డాక్టర్ కామేశ్వరి గారిది. అదే సమయంలో కుటుంబాన్నిఅద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత వా రిది. సమాజం పట్ల కూడా అంతులేని ఆర్తి . క్షణం తీరికలేని వైద్య వృత్తిలో ఉన్నా ప్రజలను కలిసేందుకు,వారిలో ఆరోగ్య స్పృహ, సామాజిక స్పృహ కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, వివిధ జిల్లాలను పర్యటించడం అంటే సాధారణ విషయం కాదు. వృత్తి,కుటుంబం, సమాజం విషయంలో డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ సూర్యప్రకాశ్ దంపతుల ప్రణాళిక ,ప్రాధాన్యాలు చూస్తే అబ్బురమనిపిస్తుంది. ఇంత ఒత్తిడిలోనూ ఇలాంటి పుస్తకం రాయాలంటే ఎంత ఓపిక ఉండాలి. ఎంత సమయం కావాలి? విషయం తెలియడం వేరు.. అందుకు ఎన్నో వందల పుస్తకాలు చదవాలి. వాటిలో పనికొచ్చే విషయాలను నోట్‌చేసుకోవాలి. వాటిని సందర్భోచితంగా ఉపయోగించుకోవాలి. తెలిసిన విషయాన్నిప్రజలకు అర్థమయ్యేలా రాయాలి. అది చదివించేలా ఉండాలి. ఇదంతా ఎంతో వ్యయప్రయాసలతో కూడుకుంది. సమాజం పట్ల ఎంతో బాధ్యత ఉంటే తప్ప ఇలాంటి పుస్తకం వెలువరించడం సాధ్యంకాదు.

### ఈ పుస్తకం ప్రధాన లక్ష్యాలు..

1. మహిళలు తమ ఆరోగ్యం, శరీర భాగాల ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం.. అవగాహన పెంచుకోవడం
2. ప్రస్తుత సమాజంలో వైద్యం పేరిట జరుగుతున్న వ్యాపారాత్మక ధోరణులను ఎండగట్టడం
3. జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి ప్రజలను సమాయత్తం చేయడం
4. ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటుకు కృషి చేయడం

ఈ లక్ష్యాల సాధనలో డాక్టర్ కామేశ్వరి దంపతులు విజయం సాధించారని చెప్పక తప్పదు. నిరంతరం విధినిర్వహణలో భాగంగా మహిళల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడటమే కాకుండా మరింత విస్తృతంగా లైఫ్ హెచ్ ఆర్ జి స్వచ్ఛంద సంస్థ ద్వారా కృషి చేస్తున్నారు. ఇప్పుడు ఈ పుస్తకం ద్వారా కూడా విశేషమైన కృషి చేశారు. సమస్య ను అర్థం చేయించడానికి ముందుగా శరీర నిర్మాణం, గర్భసంచి ఆవశ్యకత, అది చేసే పనులు తదితరాలను వివరించారు. మూలాల నుంచి విశ్లేషించారు. అదే సమ యంలో మహిళల అపోహలను తొలగించే ప్రయత్నం చేశారు. వారిని భయపెట్టి, శస్త్ర చికిత్సలకు పురికొల్పుతున్న వైనాన్ని ఎండగట్టారు.ఆర్ ఎంపీ నుంచి మొదలుకొని కార్పొరేట్ ఆస్పత్రుల వరకు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్న తీరును బయటపెట్టారు. వైద్యుల బాధ్యతను గుర్తు చేశారు. పన్నెండు అధ్యాయాల్లో అంశాలను లోతుగా వివరించారు. ప్రతి అధ్యాయం చివరన ముఖ్యాంశాలను విడిగా ఇవ్వడం మంచి ప్రయోగం. సమయం తక్కువగా ఉన్న వారికి, పుస్తకం పూర్తిగా చదవలేని వారు వాటిని చదివినా చాలు పుస్తక ఉద్దేశం అర్థమవుతుంది. చివర్లో గర్భసంచీయే వచ్చి మనతో ముచ్చటించినట్లు గర్భ సంచి కబుర్లను ఆకట్టుకునే రీతిలో బొమ్మలతో ఇచ్చారు. ఈ నాలుగు పేజీలు చదివినా గర్భసంచీ ప్రాధాన్యం అర్థమ వుతుంది. డాక్టర్ వేంకట కామేశ్వరి దంపతులకు మహిళా లోకం మీద ఉన్న ప్రేమకు, సహానుభూతికి , సమాజం పట్ల ఉన్న ఆర్తికి సాక్ష్యం ఈ పుస్తకం. వారికి హృదయపూర్వక అభినందనలు. ధన్యవాదాలు.



రావికంటి
శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్
9908892067
హైదరాబాద్

# జాతికిబాట పైడిమర్రి ప్రతిజ్ఞ

**(నేడు పైడిమర్రి వెంకట సుబ్బారావు వర్ధంతి)**



భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు...ఈ ప్రతిజ్ఞ తెలియని భారతీయుడు ఉండకపోవచ్చు... దేశవ్యాప్తంగా ప్రతి రోజు లక్షలాది విద్యార్థులు ప్రార్థన సమయాల్లో చదివే ప్రతిజ్ఞ ఇది... పాఠశాల దశ నుండే విద్యార్థుల్లో దేశభక్తిని నూరిపోసే చక్కని సాధనం ఈ ప్రతిజ్ఞ. దేశంలోని రాజ్యాంగం గుర్తించబడ్డ అన్ని భాషలలోకి అనువదించబడి అన్ని రాష్ట్రాలలోనూ విద్యార్థులు చేస్తున్న ఈ ప్రతిజ్ఞను రాసింది ఒక తెలుగు వాడు కావడం అందునా తెలంగాణ వాడు కావడం మనందరికీ గర్వకారణం. ప్రతిజ్ఞ అందరికీ తెలిసినదే అయినా ప్రతిజ్ఞ రాసిన వారెవరో దాదాపు అర్థ శతాబ్దం దాకా ఎవరికి తెలియకపోవడం విచిత్రమే. మలి తెలంగాణ ఉద్యమ చైతన్యం లో వెలుగులోకి వచ్చిన సాహితీమూర్తి పైడిమర్రి వెంకట సుబ్బారావు. కవిగా, కథకుడుగా నవలాకారుడిగా, నాటకకర్తగా అనేక ప్రక్రియలలో సృజన చేసిన ఈ సాహితీమూర్తి గొప్ప దేశభక్తుడు. 1962లో భారత–చైనా యుద్ధం సమయంలో భారతీయులలో దేశభక్తిని రగిలించడానికి ప్రతిజ్ఞ రాసిన ఆ మహనీయుని ఒక్కసారి స్మరించుకుందాం.. పైడిమర్రి వెంకటసుబ్బారావు నల్గొండ సమీపంలోని అన్నెపర్తి గ్రామంలో రాంబాయమ్మ, వెంకవూటామయ్య పుణ్యదంపతులకు జూన్ 10 , 1916 న జన్మించారు. పైడి మర్రి విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండలోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్న చందంగా చిన్నతనం నుండే పైడిమర్రి చదువుల్లో ముందుండేవారు. నాటి హైదరాబాద్ రాష్ట్రంలోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. పైడిమర్రి వెంకట సుబ్బారావు గొప్ప దేశభక్తుడు. నిజాం పాలనలోనూ ప్రజలను చైతన్య పరుస్తూ రచనలు చేశారు స్వాతంత్ర్యానంతరం కూడా దేశం యుద్ధ పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు ప్రజల్లో దేశభక్తిని రగిలించిన డానికి కవిగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. 1962లో భారత్–చైనా యుద్ధం జరుగుతున్న సమయంలో ఆయన విశాఖపట్నం ట్రెజరీ అధికారిగా ఉన్నపుడు ప్రతిజ్ఞ రచించారు. ఆనాడు చైనా దేశ ప్రభుత్వం కూడా చైనా పౌరుల్లో దేశభక్తిని పెంపొందించడానికి ప్రాథమిక విద్యా స్థాయిలోనే పిల్లలకు దేశభక్తి గేయాలను రచించి నేర్పించడం మొదలు పెట్టింది. అది గమనించిన పైడిమర్రి వెంకట సుబ్బారావు అప్పటికే బహుభాషా కోవిదులు కావడం చేత తాను కూడా భారతీయుల కోసం దేశభక్తిని పెంపొందించడానికి గేయాలుంటే బాగుంటుందని భావించాడు. పలు రచనలు చేసిన అనుభవంతో ఆ ఆలోచనకు రూపమివ్వడం మొదలుపెట్టాడు. ప్రతిజ్ఞకు పదాలు కూ ర్చాడు. విశాఖ సాహితీ మిత్రుడు తెన్నేటి విశ్వనాథంతో చర్చించాడు. 'వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలము' అన్న వాక్యాన్ని అదనంగా చేర్చాడు. తాను రూపొందించిన ప్రతిజ్ఞను పాఠ్యపుస్తకాల్లో చేర్చడం కోసం పైడిమర్రి పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు ఆనాటి కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వంలో అప్పటి విద్యాశాఖ మంత్రి విజయనగరం రాజాగా పేరుగాంచిన పీవీజీ రాజు కూడా సాహితీవేత్త కావడం వారికి కలిసొచ్చింది. తేన్నేటి సాయంతో ప్రతిజ్ఞను పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాని విలువను, అవసరాన్ని వివరించి ఓ ప్రతిని అందజేశారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశం జరిపినపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించి 1965 జనవరి 26 నుంచి దేశమంతటా చదువుతున్నారు.

**పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు మాత్రం జరిగాయి.**

**ప్రతిజ్ఞ ప్రస్తుత రూపం ఇలా ఉంది**

**భారతదేశం నా మాతృభూమి.**
**భారతీయులందరూ నా సహోదరులు.**
**నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను.**
**సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం.**
**దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.**
**నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను.**
**ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను.**
**నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.**
**వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.**

వీరు వ్రాసిన ప్రతి అన్ని భారతీయ భాషలలోనూ ప్రచురితమైననూ, లక్షలాది మంది విద్యార్థులు రోజూ చదువుతున్నప్పటికీ పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరు ఎక్కడ కనిపించకపోవడం విచారించ దగ్గ విషయమే. తెలంగాణ ఏర్పడే వరకు ప్రతిజ్ఞ చివర పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరు ఏ పాఠ్యపుస్తకంలోనూ లేదు. తెలం గాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం పైడిమర్రికి పాఠ్యపుస్తకాలలో సముచిత స్థానం దక్కింది. ప్రపంచ తెలుగు మహాసభల్లో వారిని సముచిత రీతిన స్మరించుకోగలిగాము. పైడిమర్రి వెంకట సుబ్బారావు కవి, కథకుడు, నవలాకారుడు, నాటకకర్త, అనువాదకుడు ఇలా బహుముఖీనమైన ప్రజ్ఞ వారి సొంతం.ఆయన తన 18వ ఏటనే 'కాలభైరవుడు' (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్యకావ్యాలు, బ్రహ్మచర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాలరామాయణం, వెంక స్తుతి మొదలైన రచనలు సుబ్బారావు చేశారు. అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్ర పత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో వీరి రచనలు ప్రచురితమైనాయి. వీరి పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, వీరి కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. నల్లగొండ యువ రచయితల సమితి పక్షాన ప్రచురించిన సమర్పణ దర్పణం మాలిక కథా సంకలనాలు సంఘర్షణ, సైరన్ కవితా సంకలనాలు వెలుగు చూడడం లో వీరి కృషి అనన్య సామాన్యం. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945–46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. వీరి పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు. 1977 నుండి 1988 వరకు నల్లగొండ గాంధీ పార్కులో ఉచిత హెూమియో వైద్య సేవలందించారు. పైడిమర్రి రచనలను భవిష్యత్ తరాలకు అందించాలన్న ఉద్దేశంతో ఆయన లైబ్రరీని తన కుమారులు నల్లగొండలోని గీత విజ్ఞాన్ ఆంధ్ర కళాశాలకు అందించారు ఉద్యోగ విరమణ అనంతరం 1988, ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు.

**వెలుగులోకి వచ్చింది ఇలా..**

నల్లగొండకు చెందిన ప్రముఖ పరిశోధకుడు, సాహితీవేత్త, పత్రికా రచయిత ఎలికట్టె శంకర్రావు నల్లగొండ కథలు పేరుతో వంద సంవత్సరాల నల్లగొండ జిల్లా కథా చరిత్రను రికార్డు చేయదలచి బృహత్ సంకలనాన్ని వెలువరించడానికి పూనుకున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ కథకుల గురించి శోధిస్తూ పైడిమర్రి వెంకట సుబ్బారావు గారి కథలను వెతికే క్రమంలో వారి ఇంటికి వెళ్లారు అక్కడ వారి సాహిత్యాన్ని పరిశీలిస్తుండగా ప్రతిజ్ఞ లభించింది. ఇది తన తండ్రి గారు రాశారని వారి వారసులు చెప్పగా విని ఒకింత ఆశ్చర్యానికి లోనై దీన్ని వెలుగులోకి తేవాలని పూనుకున్నారు. అనుకున్నదే తడవుగా ప్రతిజ్ఞ పైడిమర్రి వారు రాసిందే అని నిరూపించే మరి కొన్ని ఆధారాలు సాధించి ప్రతిజ్ఞ పద శిల్పి పైడిమర్రి అనే పేరుతో ఆంధ్రజ్యోతిలో వ్యాసాన్ని ప్రకటించారు. ఇది ఒక విధంగా ఆ రోజుల్లో సంచ లనమే. ఇప్పటి వరకు ఈ ప్రతిజ్ఞ ఎవరు రాశారో తెలియదు. ఒక్కసారిగా నల్లగొండకు చెందిన పైడిమర్రి వెంకట సుబ్బారావు రాసినట్లుగా ఎలికట్టె శంకర్రావు ప్రకటించడం నాటి పరిశోధకుల ఆశ్చర్యానికి కారణమైంది. అంతటితో ఊరుకోకుండా పైడిమర్రి వెంకట సుబ్బారావు సన్నిహితులు సమకాలికులను సంప్రదించి పైడిమర్రి వెంకట సుబ్బారావు సాహిత్యమూ, ప్రతిజ్ఞ నేపథ్యాన్ని 'ప్రతిజ్ఞ పద శిల్పి పైడిమర్రి' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చారు. ఈ గ్రంథాన్ని పైడిమర్రి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో పైడిమర్రి వెంకట సుబ్బారావు గారి సతీమణి ఆవిష్కరించారు. నల్లగొండ జిల్లా పరిషత్ హాల్ లో జరిగిన ఈ సభకు అనేక ప్రముఖ సాహితీవేత్తలు హాజరయ్యారు. అయినా శంకరరావు గారి పరిశోధన తృష్ణ తీరలేదు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజుల్లో పైడిమర్రి వెంకట సుబ్బారావు కేవలం తెలంగాణ వాడు కావడం చేత నిర్లక్ష్యం చేయబడ్డారు అని భావించి ప్రతిజ్ఞ 50 ఏళ్ల వివక్ష అనే పేరుతో మరో పుస్తకాన్ని ప్రకటించారు. ప్రతిజ్ఞ ను గుర్తించి పైడిమర్రి వెంకట సుబ్బారావు గారి పేరు ప్రతిజ్ఞ కింద చేర్చవలసిందిగా సెక్రటేరియట్‌కు కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగారు. ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత నూతన పాఠ్య పుస్తకాలలో ప్రతిజ్ఞ రచయితగా పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరు పుస్తకాలలో ప్రకటించారు. శంకరరావు కృషి కొంతమేర సఫలీకృతం అయినా ఆయన ఆశించినంతగా ప్రతిజ్ఞకు గుర్తింపు రాలేదనే చెప్పాలి. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలలోనూ పాఠ్యపుస్తకాలలో పైడిమర్రి వారి పేరు చేర్చవలసి ఉంది. పైడిమర్రి వారి ప్రతిజ్ఞను యావద్భారత జాతికీ గుర్తించడం ఎంత అవసరమో దానిని వెలుగులోకి తెచ్చిన పరిశోధకులు ఎలికట్టె శంకర్ రావుపరిశోధనా కృషిని గుర్తించడం కూడా అంతే అవసరం. ఇది సాహిత్య సంస్కారం కూడా. ఈ సాహితీమూర్తికి తెలుగు సాహిత్యంలో ఇంకా దక్కవలసిన గౌరవం దక్కలేదనే చెప్పాలి. తెలంగాణ సృజనశీలి, దేశభక్తుడికి సరైన గుర్తింపు దక్కాలె. ఆయనకు గుర్తింపు, గౌరవం దక్కడమంటే తెలంగాణకు దక్కినట్లే. పైడిమర్రి రచనలన్నీ తెలంగాణ సాహిత్య అకాడమీ ద్వారా పునర్ముద్రణ జరగాలి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ పాఠ్యపుస్తకాలలో పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరు ప్రతిజ్ఞ రచయితగా ముద్రిస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోనూ పాఠ్యపుస్తకాలలో పైడి వారి పేరును ముద్రించాలి. విశేషించి పైడిమర్రి జీవితాంతం తాను ఆకాంక్షించిన విద్యార్థులలో దేశభక్తి ప్రోది చేయడం లక్ష్యంగా పాఠ్యాంశ నిర్మాణాలు జరగాలి. అదే ఆ మహనీయుడికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

- డా. సాగర్ల సత్తయ్య, నల్లగొండ
7989117415

# ఓట్ల చోరీ అంటే ఏమిటో "ఆయన"కు అర్థం కాలేదట!



గత సార్వత్రిక ఎన్నికల్లో భారీ ఓట్ల చోరీ జరిగిందని చెబుతూ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న ఆందోళన ఆయనకు అర్థం కావడం లేదట. ఈ అంశంపై దాదాపుగా మొత్తం ప్రతిపక్షం దేశవ్యాప్తంగా పెద్ద ఆందోళన చేస్తున్నది. అది "ఆయన"కు అర్థం కావడంలేదట. చాలా చిత్రమైన విషయమిది.ఆశ్చర్యం గొలిపే సంగతి ఇది. అర్థం కాకపోవడానికి అదేమీ బ్రహ్మాండం కాదు, బ్రహ్మ పదార్థమూ కాదు. అతి సాధారణ విషయమది. బడి పిల్లలకు కూడా తేలిగ్గా తెలిసి పోయే సంగతి ఇది. అర్హుడైన ఒక వయోజనుడి పేరును అకారణంగా ఓటర్ల జాబితా నుంచి తీసి వేయడం.అంటే సదరు వ్యక్తికి ఓటు హక్కును నిరాకరించడం , తొలగించడం అన్నట్లు. సామాన్యులకు సైతం చాలా తేలిగ్గా అర్థమయ్యే సంగతి కదా. ఇది అర్థం చేసుకోవడానికి దీనికి పెద్దగా చదువు, సంధ్యలు ఏమీ అక్కర్లేదు. అసలు చదువే అక్కర్లేదు. నిజానికి చదువుతో దీనికి ఎలాంటి సంబంధమూ లేదు. చదువుతో నిమిత్తం లేని అతి చిన్న సంగతి ఇది. సాధారణ లోకజ్ఞానానికి సంబం ధించిన సంగతి ఇది. అలాంటిది ఓటు చోరీ, తొలగింపు, గల్లంతు అనేవి "ఆయన"కు తెలియడం లేదట!ఇది ఆశ్చర్యం గొలిపే సంగతే మరి. ఆయన ఏమీ అనామకుడు కాదు.అర్భకుడు కూడా కాదు. చదువు సంధ్య ఉన్న వాడే. ఉన్నత చదువులు చదివిన వాడే. చాలా కాలంగా రాజకీయాల్లో ఉన్న పెద్ద మనిషే. కొన్నిసార్లు చట్ట సభలకు ఎన్నికైన వ్యక్తే.సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన వ్యక్తి ఆయన. ప్రభుత్వ చీఫ్ విప్ పదవిని నిర్వహించిన వ్యక్తే ఆయన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొంత కాలం పాటు ముఖ్యమంత్రి పదవిని సైతం వెలగ బెట్టాడు లెండి ఆయన. ఒకప్పుడు ఒక రాజకీయ పార్టీని కూడా స్థాపించారాయన. చెప్పులు ఆ పార్టీ ఎన్నికల చిహ్నంగా ఉం డేవి. అలాంటి వ్యక్తికి ఇలాంటి అతి సామా న్యమైన సంగతులు అర్థం కాకపోవడం చిత్రమే కదా. ఇప్పుడాయన ప్రస్తుత జాతీయ అధికార పార్టీ శిబిరంలోకి ఫిరాయించారు లెండి. ఇప్పుడాయన ఆ పార్టీ గంతలు ధరించారు కదా. అందుకేనేమో..ఇలాంటి చిన్న సంగతులు కూడా కనిపించడం లేదేమో. తెలియడం లేదేమో.




గండె గోవర్ధన్

# ప్రపంచకప్ గెలుస్తాం..
# ట్రోఫీ లోటును ఈసారి పూరిస్తాం




ముంబై : భారత మహిళా క్రికెట్‌లో ఏండ్లుగా ఊరిస్తున్న తొలి ఐసీసీ ట్రోఫీని ఈసారి స్వదేశంలో తప్పక సాధిస్తామని టీమ్ఇండియా సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది.

వచ్చే నెల 30 నుంచి భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించబోయే ఈ మెగా టోర్నీకి '50 రోజుల కౌంట్‌డౌన్' సందర్భంగా ముంబైలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హర్మన్‌ప్రీత్‌తో పాటు స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ 'సొంత అభిమానుల ఎదుట ఆడటం ఎప్పుడూ ప్రత్యేకమే. భారతీయులందరూ ఎంతోకాలంగా వేచి చూస్తున్న లోటు (ఐసీసీ ట్రోఫీ)ను ఈసారి పూరించాలని మేము కోరుకుంటున్నాం. ప్రపంచకప్‌లు ఎప్పటికీ ప్రత్యేకం. దేశం కోసం ఏదైనా ప్రత్యేకంగా చేయడం గర్వంగా ఉంటుంది' అని తెలిపింది. మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ 2005, 2017లో ఫైనల్ చేరినా రెండు సందర్భాల్లోనూ రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది. ప్రపంచకప్ కంటే ముందే స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగబోయే వన్డే సిరీస్ తమ ముందున్న సవాల్ అని హర్మన్‌ప్రీత్ చెప్పింది. ఈ సిరీస్ గెలవడం తమ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఆమె అభిప్రాయపడింది. స్మృతి మాట్లాడుతూ.. 'గత కొన్నాళ్లుగా భారత్‌లో మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరిగింది. ప్రపంచకప్ విషయానికొస్తే మేం బాగా ప్రిపేర్ అవుతున్నాం. శిక్షణా శిబిరాల్లో మా లోపాలను చర్చించుకుంటూ ముందుకు సాగుతున్నాం. అభిమానుల మద్దతు మాకు ఎల్లప్పుడూ ఉంటుందని ఆశిస్తున్నాం' అని తెలిపింది. ఈ కార్యక్రమంలో ఐసీసీ చైర్మన్ జై షా, బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌తో పాటు మాజీ సారథి మిథాలీ రాజ్ కూడా పాల్గొన్నారు.

# భారత యువ బాక్సర్ రితికాకు పసిడి



బ్యాంకాక్ : ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ రితిక స్వర్ణ పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన మహిళల 80ంకిలోల ఫైనల్ బౌట్‌లో రితిక..అస్సెల్ తోక్సాన్(కజకిస్థాన్)పై అలవోక విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన రితిక పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడింది. రౌండ్ రౌండ్‌కు తన ఆధిక్యాన్ని మెరుగుపర్చుకుంటూ ఘన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మరోవైపు 57కిలోల తుది పోరులో యాత్రి పటేల్.. ఖుమోరబోను మమాజనోవా(ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడి రజత పతకంతో సంతృప్తి పడింది. 60కిలోల టైటిల్ ఫైట్‌లో ప్రియ 2-3 తేడాతో యు తియాన్(చైనా) చేతిలో ఓటమిపాలై రెండో స్థానంలో నిలిచింది.

# నా మోకాలి నొప్పి ఎవరు భరిస్తారు?..
# అభిమానితో ఎంఎస్ ధోనీ!

టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఐదేళ్లు అయింది. అయినా కూడా మహీ క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ఆడుతూ అభిమానులను అలరిస్తున్నాడు. ఐపీఎల్‌లో కేవలం రెండు నెలలు మాత్రమే ఆడే ధోనీ కోసం ఫాన్స్ ఎంతగానో వెయిట్ చేస్తారు. అయితే గత రెండు సంవత్సరాలుగా ఇదే చివరి సీజన్ అంటూ వార్తలు వస్తున్నా.. మహీ ఆడుతూ వస్తున్నాడు. ఐపీఎల్ 2025 అనంతరం ధోనీ వీడ్కోలుపై వార్తలు వచ్చాయి. ఇటీవలి కాలంలో మహీ ఏ కార్యక్రమంకు హాజరయినా.. ఐపీఎల్ రిటైర్మెంట్‌పై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. తాజాగా ఓ ఈవెంట్‌లో ఎంఎస్ ధోనీ పాల్గొనగా ఐపీఎల్ 2026లో ఆడుతారా? అనే ప్రశ్న ఎదురైంది. 'నేను ఐపీఎల్ 2026లో ఆడతానో లేదో ఇంకా తెలియదు. ఎప్పుడూ చెప్పే మాటే.. ఐపీఎల్‌కు ఇంకా చాలా సమయం ఉంది. డిసెంబర్ వరకు ఓ నిర్ణయం తీసుకుంటా. ముందే ఏదో ఒకటి చెప్పడం సరైంది కాదు' అని ధోనీ తెలిపాడు. 'మీరు తప్పకుండా ఐపీఎల్ ఆడాలి సర్' అని ఓ ఓ అభిమాని అనగా.. ధోనీ స్పదించాడు. 'నా మోకాలు నొప్పిగా ఉంది. మరి ఆ నొప్పిని ఎవరు భరిస్తారు?' అని సరదాగా అన్నాడు. దాంతో అక్కడ నవ్వులు పూశాయి. అభిమానికి మహీ ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 44 ఏళ్ల ధోనీ ఐపీఎల్‌లో ఆడాలని ఫాన్స్ కోరుకుంటున్నారు. ఎంఎస్ ధోనీ ఐపీఎల్‌లో 2008లో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు 278 మ్యాచ్‌లు ఆడి 5439 పరుగులు చేశాడు. మహీ వ్యక్తిగత అత్యధిక స్కోర్ 84 నాటౌట్. ఇప్పటి వరకు 24 హాఫ్ సెంచరీలు చేశాడు. ఐపీఎల్‌లో ధోనీ 375 ఫోర్లు, 264 సిక్స్‌లు బాదాడు. మోకాలి నొప్పి కారణంగా గత రెండు సీజన్‌లలో మహీ సింగిల్స్ తీయకుండా.. ఎక్కువగా బౌండరీలు మాత్రమే బాదుతున్నాడు.




కీపింగ్‌లో మాత్రం కుర్రాళ్లతో పోటీపడుతూ.. మెరుపు స్టంపింగ్‌లు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌కు మహీ ఐదు ఐపీఎల్ టైటిల్స్ అందించిన విషయం తెలిసిందే.

# స్నేహిత్‌కు కాంస్యం

వడోదరా : వడోదరా వేదికగా జరుగుతున్న యూటీటీ జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ యువ ప్లేయర్ ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ కాంస్య పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో స్నేహిత్ 9-11, 12-14, 12-10, 10-12, 9-11తో రోనిత్ భాంజ చేతిలో ఓటమి పాలయ్యాడు. టోర్నీలో నిలకడగా రాణించిన స్నేహిత్.. సెమీస్‌లో ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో విఫలమయ్యాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో స్నేహిత్ 12-10, 5-11, 11-5, 11-9తో అంకుర్ భట్టాచార్జీపై గెలిచాడు. టోర్నీలో మంచి ఫామ్‌మీద ఉన్నప్పటికీ సెమీస్‌లో అదే జోరు కొనసాగించలేకపోయానని మ్యాచ్ ముగిసిన తర్వాత స్నేహిత్ పేర్కొన్నాడు.




## పసిడి ప్రియులకు శుభవార్త
## తగ్గిన గోల్డ్ రేట్స్



పసిడి ప్రియులకు శుభవార్త. గత వారం ట్రంప్ సుంకాల కారణంగా బంగారం ధరలు కొండెక్కాయి. రికార్డ్ స్థాయిలో బంగారం ధరలు పెరిగాయి. శ్రావణమాసంలో ధరలు పెరగడంతో కొనుగోలుదారులు హడలెత్తిపోయారు. ఈ వారం కూడా ధరలు మరింత పెరగొచ్చన్న నిపుణుల హెచ్చరికలతో బెంబేలెత్తిపోయారు. కానీ ఈ వారం మాత్రం కాస్తా ధరలు ఉపశమనం కలిగించాయి. తులం బంగారం ధర రూ. 760 తగ్గింది. ఇక వెండి ధరలు కూడా ఉపశమనం కలిగిస్తున్నాయి. 24 క్యారెట్ల గ్రాము బంగారం ధర 760 రూపాయలు తగ్గి.. రూ. 1,02, 280 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 22 క్యారెట్ల గ్రాము బంగారం ధర 700 రూపాయిలు తగ్గి.. తులం బంగారం ధర రూ. 93,750 దగ్గర ట్రేడ్ అవుతోంది. మరోవైపు 18 క్యారెట్ల గ్రాము బంగారం ధర 570 రూపాయిలు తగ్గి 10 గ్రాముల ధర రూ. 76,710 దగ్గర ట్రేడ్ అవుతోంది. వెండి ధర మాత్రం కాస్త ఉపశమనం కలిగించింది. కేజీ వెండి రూ. 1,17, 000 దగ్గర ట్రేడ్ అవుతుంది. చెన్నైలో మాత్రం కేజీ సిల్వర్ ధర రూ. 1, 27, 00 ఉండగా.. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరులో మాత్రం రూ. 1,17,000 దగ్గర ట్రేడ్ అవుతుంది.

## హైదరాబాద్‌లో జెడ్ఎస్ కార్యాలయం

హైదరాబాద్ : మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్, టెక్నాలజీ సంస్థ జెడ్ఎస్ హైదరాబాద్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించింది. హైటెక్ సిటీలోని రహేజా ఐటీ పార్క్‌లో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయంలో 500-600 మంది ఉద్యోగులు పని చేయవచ్చని జెడ్ఎస్ వెల్లడించింది. దేశంలోని హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ జీసీసీల కోసం తన సర్వీస్ సామర్థ్యాలు విస్తరించే వ్యూహంలో భాగంగానే ఈ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో తాము కార్యకలాపాలు ప్రారంభించిన ఏడాది లోగానే ఈ వ్యూహాత్మక విస్తరణ కూడా చేపట్టినట్టు కంపెనీ రీజినల్ మేనేజింగ్ ప్రిన్సిపల్ మోహిత్ సూద్ తెలిపారు. అమెరికాలోని ఇవాన్‌స్టన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జెడ్ఎస్ ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న 35 కార్యాలయాల్లో 13,000 మంది పని చేస్తున్నారు. భారత్‌లోని పుణె, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, నోయిడా కార్యాలయాల్లో 10,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

# ఆవు పేడతో లక్షలు.. నిషా జైస్వాల్ సక్సెస్ స్టోరీ..

కోవిడ్ మహమ్మారి ఎందరో జీవితాలను ప్రభావితం చేసింది. అలా కోవిడ్ కారణంగా ప్రభావితం అయిన వారిలో మధ్యప్రదేశ్‌లోని రేవా పట్టణంలోని నాకా ప్రాంతంలో నివసించే నిషా ఒకరు. లాక్‌డౌన్ కారణంగా ప్రజలు ఉద్యోగాలు కోల్పోతున్న సమయంలో నిషా బ్యాంకింగ్ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఈక్రమంలో ఆమె ఉద్యోగం కోసం వేచి ఎదురుచూడకుండా, కోవిడ్ సమయంలోనే తనే నలుగురికి ఉపాధిని ఇచ్చేలా ఒక స్టార్టప్‌ను ప్రారంభించింది. ఇంతకి ఆమె స్థాపించిన స్టార్టప్ ఏంటి, అసలు ఆమె సక్సెస్ స్టోరీ ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.. నిషా తండ్రి పంచాయతీ కార్యదర్శి, ఆమె తల్లి గృహిణి. ఆమెకు ఒక అక్క, చార్టర్డ్ అకౌంటెంట్ అయిన సోదరుడు ఉన్నారు. నిషా రేవాలోని సెంట్రల్ అకాడమీ స్కూల్ నుంచి పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, భోపాల్‌లోని బర్కతుల్లా విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. తర్వాత ఆమె బ్యాంకింగ్ పరీక్షలకు సిద్ధం కావడం ప్రారంభించింది. కరెక్ట్‌గా అదే సమయానికి కోవిడ్ మహమ్మారి కారణంగా ఆమె తన చదువును మధ్యలో వదిలేసింది. ఇక దేని కోసం ఎదురుచూడకుండా తానే ఒక స్టార్టప్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. చిన్నప్పటి నుంచి తనకు, తన కుటుంబానికి ఆవులంటే చాలా అభిమానం అని నిషా తెలిపింది. ఆమె కుటుంబ సభ్యులు కొందరు చాలా కాలంగా ఆవులను పెంచుతున్నారు. లాక్‌డౌన్ సమయంలో ఇంట్లో ఖాళీగా ఉన్నప్పుడు ఆమెకు తన సొంత వెంచర్‌ను ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. ఆవు పేడతో అగరుబత్తులు తయారు చేయాలనే ఆలోచన చేసినట్లు నిషా పేర్కొంది. తన ఆలోచన రూపం దాల్చడానికి తన అన్నయ్య రూ. 4 లక్షలు ఇచ్చి స్టార్టప్ ప్రారంభించడానికి సహాయం చేశాడంది. వ్యాపారులకు ఉచితంగా అగరుత్తులు ఇవ్వడం అనే నిషా మార్కెట్ ప్లాన్ సక్సెస్ అయ్యింది. చివరికి వినియోగదారుల నుంచి అగరుబత్తులకు మంచి స్పందన లభించింది. ఆమె ఉత్పత్తి న్యాణమైనదని, గుర్తించిన ప్రజలు ఆమె విజయంలో కీ రోల్ ప్లే చేశారు. క్రమక్రమంగా మార్కెట్లో ఆమె అగరుబత్తులకు డిమాండ్ పెరగడంతో, నిషా క్రమంగా తన వ్యాపారాన్ని విస్తరించింది. ఆమె



అగరుబత్తులను పెద్ద మొత్తంలో తయారు చేయడానికి ఒక ఆటోమేటిక్ యంత్రాన్ని కొనుగోలు చేసింది. ఈక్రమంలో ఆమె తన స్టార్టప్‌లో కొంతమంది స్థానికులకు ఉపాధి కల్పించింది. ప్రతి సంవత్సరం ఆమె దాదాపు రూ. 2 లక్షలు సంపాదిస్తున్నట్లు, ఇప్పటి వరకు తన స్టార్టప్ రూ. 5 నుంచి రూ. 6 లక్షల లాభం సంపాదించిందని చెప్పారు. ఆవు పేడతో తయారు చేసిన సువాసన గల ధూపం కర్రలకు నిషా పేటెంట్ పొందింది. ఆమె తన బ్రాండ్‌కు 'సాత్విక్' అని పేరు పెట్టింది. తన తయారు చేసే ప్రాడక్ట్స్ పర్యావరణ అనుకూలంగా ఉంటాయని తెలిపింది. సాత్విక్ బ్రాండ్ వస్తువులు గులాబీ, లావెండర్, గుగ్గల్, పైనాపిల్, గంధపు చెక్క వంటి వివిధ సువాసనలలో లభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది భారతీయ రైల్వేల 'వన్ స్టేషన్, వన్ ప్రొడక్ట్' పథకంలో కూడా ఎంపికైంది. ఈ పథకం కింద ఈ ఉత్పత్తులు రేవా రైల్వే స్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఇవే కాకుండా ఆమె ఇల్లు, కార్యాలయ అలంకరణ కోసం ఉత్పత్తులను కూడా తయారు చేస్తున్నట్లు తెలిపారు. దీపావళి సందర్భంగా ఇళ్లను అలంకరించడానికి ఆవు పేడతో తయారు చేసిన ఆకర్షణీయమైన దియాలను, పర్యావరణ అనుకూల రాఖీలతో సహా అనేక ఉత్పత్తులను తయారు ఆమె చేస్తున్నారు. నిషా తన ఉత్పత్తులను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ వాణిజ్య వేదికలలో త్వరలో విక్రయించాలని చూస్తున్నట్లు తెలిపారు. నిషా ప్రస్థానం ఎందరో యువతులకు ప్రేరణగా నిలుస్తుంది.

# కనీస నిల్వ నిర్ణయం బ్యాంకుల ఇష్టం

గౌజారియా (గుజరాత్): బ్యాంకులకు పొదుపు ఖాతాల కనీస నగదు నిల్వ పరిమితిని నిర్ణయించే స్వేచ్ఛ ఉందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఇది ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో రెండో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ తన పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిని 10,000 నుంచి ఏకంగా రూ. 50,000కు పెంచడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గుజరాత్‌లోని గౌజారియా గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఓ ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మల్హోత్రాను మీడియా వర్గాలు ఇదే విషయంపై ప్రశ్నించాయి. "పొదుపు ఖాతాల కనీస నిల్వ పరిమితిపై నిర్ణయాన్ని ఆర్‌బీఐ ఆయా బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు కనీస నిల్వను రూ. 10,000గా నిర్ణయించగా.. మరికొన్ని రూ. 2,000కు పరిమితం చేశాయి. ఈ మధ్యనే కొన్ని బ్యాంకులు పరిమితిని పూర్తిగా ఎత్తివేశాయి. ఇది ఆర్‌బీఐ నియంత్రణలో లేని అంశ"మని మల్హోత్రా సమాధానమిచ్చారు. ఆర్థిక శాఖకు లేఖ రాసిన బీబీడీబీఎం: ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నిర్ణయాన్ని బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్ (బీబీడీబీఎం) తప్పుపట్టింది. ఈ



విషయంలో జోక్యం చేసుకోవాలంటూ కేంద్ర ఆర్థిక శాఖకు ఈ సంస్థ లేఖ కూడా రాసింది. ఈ అన్యాయమైన, తిరోగమన నిర్ణయం బ్యాంకింగ్ సేవల సమ్మిళితం, వృద్ధి లక్ష్యాలకు విఘాతమని లేఖలో పేర్కొంది. ప్రభుత్వ బ్యాంకుల్లో కనీస నిల్వ పరిమితి ఎత్తివేత:

## ఒక నెలలో రూ.18 వేల కోట్లు వెనక్కి.. స్టాక్ మార్కెట్‌పై ప్రభావం ఎంతంటే..!

భారత స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారులు నిరంతరం డబ్బును ఉపసంహరించుకుంటున్నారు. ఒక ఆగస్టు నెలలోనే దలాల్ స్ట్రీట్ నుంచి రూ. 18 వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. మొదటి త్రైమాసికంలో కంపెనీల బలహీన ఫలితాలు, అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు, రూపాయి విలువ పతనం కారణంగా విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు ఆగడం లేదని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీని కారణంగా మార్కెట్లో కూడా చాలా ఒత్తిడి కనిపిస్తోందని అన్నారు. గత వారంలో స్టాక్ మార్కెట్ మందకొడిగా కొనసాగింది. వారంలో చివరి ట్రేడింగ్ రోజైన శుక్రవారం.. మార్కెట్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 765.47 పాయింట్లు పడిపోయి 79,857.79 వద్ద ముగిసింది. సూచి పతనానికి ప్రధాన కారణాలలో ఒకటి మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదారులు వేగంగా డబ్బును ఉపసంహరించుకోవడమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు 2025లో ఇప్పటివరకు భారత స్టాక్ మార్కెట్ నుంచి రూ. 1.13 లక్షల కోట్లు ఉపసంహరించుకున్నారు. డిపాజిటరీ డేటా ప్రకారం.. ఆగస్టు 1 - 8 మధ్య, షేర్ల నుంచి రూ. 17,924 కోట్లు ఉపసంహరించుకున్నారు. జూలైలో కూడా రూ. 17,741 కోట్లు ఉపసంహరించుకున్నారు. కానీ మార్చి, జూన్ మధ్య కాలంలో భారత స్టాక్ మార్కెట్‌లో రూ. 38,673 కోట్లు పెట్టుబడి పెట్టారు. మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియాకు చెందిన హిమాన్షు శ్రీవాస్తవ మాట్లాడుతూ.. ఇటీవల చోటుచేసుకుంటున్న విదేశీ పెట్టుబడిదారులు ఉపసంహరణలకు భారత్-అమెరికా వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం, బలహీనమైన త్రైమాసిక ఫలితాలు, రూపాయి విలువ తగ్గడం కారణమని అన్నారు. జూలై చివరలో అమెరికా భారతీయ వస్తువులపై 25% సుంకం విధించింది. దానికి గత వారం అదనంగా 25% సుంకాన్ని జోడించింది. ఇది మార్కెట్లో భయాన్ని, షేర్ల విక్రయానికి కారణం అయ్యిందని అభిప్రాయపడ్డారు. ఏంజెల్ వన్ విశ్లేషకుడు వకార్ జావేద్ ఖాన్ మాట్లాడుతూ.. ఈపరిస్థితి %ఖీ×% సెంటిమెంట్‌ను ప్రభావితం చేసిందని, పెట్టుబడిదారులు రిస్క్-విముఖత వ్యూహాన్ని అనుసరించారని అన్నారు. అమెరికా బాండ్ దిగుబడి పెరుగుదల కారణంగా విదేశీ మూలధనం అమెరికా వైపు కదులుతోందని పేర్కన్నారు. అయితే, ఈ కాలంలో, సాధారణ రుణ పరిమితిలో రూ. 3,432 కోట్లు, రూ. 58 కోట్లు పెట్టుబడి పెట్టాయి. భవిష్యత్తులోసెంటిమెంట్ బలహీనంగా ఉండవచ్చని, వచ్చే వారం మార్కెట్ దిశను వాణిజ్య చర్చలు, సుంకాల వివాదాలు నిర్ణయిస్తాయని ఖాన్ తెలిపారు.



# సదా కొత్త అవతారం..

సదా పేరు చెబితే చాలామందికి 'జయం' సినిమాలో ఆమె చెబుతున్న "వెళ్ళవయ్యా వెళ్ళు" అనే డైలాగ్ వెంటనే గుర్తొస్తుంది. ఆ సినిమా ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ, తన టాలెంట్‌తో అతి తక్కువ సమయంలో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అంతేకాదు, లెజెండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అపరిచితుడు'లో అవకాశం దక్కించుకుంది. దీంతో సౌత్ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయినా, ఆమె కెరీర్ ఊహించినంత ముందుకు సాగలేదు. 'అపరిచితుడు' తర్వాత సదా సరైన స్క్రిప్ట్‌లు ఎంచుకోలేకపోయింది. వరుస ఫ్లాపులతో ఆమె క్రేజ్ తగ్గుతూ వచ్చింది. సినిమాలు ఆశించిన స్థాయి చేరకపోవడంతో పాటు, కొన్ని గోల్డెన్ ఆఫర్స్‌ను వదులుకోవడం కూడా ఆమె కెరీర్‌కు ఎదురుదెబ్బ అయ్యింది. చంద్రముఖి సినిమాలో మొదటగా జ్యోతిక పాత్రకు సదాకే అవకాశం వచ్చింది. కానీ 'అపరిచితుడు' షూటింగ్ కారణంగా డేట్స్ కుదరక, ఆ అవకాశాన్ని కోల్పోయింది. శేఖర్ కమ్ముల 'ఆనంద్' చిత్రం కోసం కూడా మొదటగా సదానే అని అనుకున్నారు. కానీ ఆమె ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించడంతో మరో హీరోయిన్‌కి ఆ అవకాశం దక్కింది. ఇలా సదా అప్పుడు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో తన కెరీర్ సందిగ్ధంలో పడ్డట్టు అయింది. అయితే సిల్వర్ స్క్రీన్ దూరమైనా, సదా బుల్లితెరపై కొన్నాళ్లు తన హవా కొనసాగించింది. 'ఢీ', 'నీతోనే డాన్స్' వంటి డ్యాన్స్ షోలు జడ్జిగా హాజరై మళ్లీ పాపులారిటీ తెచ్చుకుంది. అయితే ఇటీవలి కాలంలో సినిమా, టీవీ రెండినీ కూడా పక్కనపెట్టి సదా పూర్తిగా కొత్త దిశగా అడుగులు వేసింది. సదా ఇప్పుడు కెమెరా ముందుకు కాకుండా కెమెరా వెనకకు వెళ్లింది! ఆమె ప్రస్తుతం వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీపై పూర్తిగా ఫోకస్ పెట్టింది. అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి, అడవుల్లో జంతువుల వీడియోలు చిత్రీకరించి షేర్ చేస్తోంది.ఇటీవల ఆమె తన నికాన్ కెమెరాతో ఆఫ్రికా అడవుల్లో ఓలోమిన జాతికి చెందిన సింహాన్ని చిత్రీకరించింది. ఆ సింహం స్లోమోషన్‌లో నడుస్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని చూసినవారంతా సదా ఫోటోగ్రఫీ టాలెంట్‌కి ఫిదా అయ్యారు.



# సినిమా..

## సమంతలా ఉండే నువ్వు.. ప్రియా ఆనంద్‌లా ఐపోయావ్..?

అష్షురెడ్డి సోషల్ మీడియా అణుబాంబు. ఎప్పుడూ పొట్టి పొట్టి బట్టల్లో హాట్ గా కనిపిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు పద్ధతిగా కూడా కనిపిస్తుంది. అలాంటి అష్షు చూడడానికి జూనియర్ సమంతలా ఉంటుంది. ఈ విషయాన్ని నెటిజన్స్,ఫాన్స్ అంటూ ఉంటారు. జూనియర్ సమంత అంటూనే కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఐతే ఈ మధ్యకాలంలో ఆమె రూపు రేఖల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. జిమ్ కి వెళ్తూ కొంచెం సన్నబడింది. రీసెంట్ గా తన ఇన్స్టాగ్రామ్ పేజీలో ఒక షార్ట్ డ్రెస్ లో క్యూట్ హాట్ పిక్స్ ని షేర్ చేసింది. ఐతే ఇందులో ఆమె సమంత లుక్స్ అస్సలు కనిపించడం లేదు. ఒక నెటిజన్ ఆమె గురించి ఒక చేశారు. " సమంతలా ఉండేదానివి ప్రియా ఆనంద్ లా అయ్యావ్. కావాలంటే ఒక గంట కూర్చుని నీ లేటెస్ట్ పిక్స్ చూసుకో" అంటూ పోస్ట్ చేశారు. ప్రియా ఆనంద్ లీడర్ మూవీలో రత్నప్రభ అనే రోల్ లో అలాగే రామ రామ కృష్ణ కృష్ణ అనే మూవీలో ప్రియా రోల్ లో నటించింది. అలాగే అష్షు ఫామిలీ స్టార్స్ షోలో సుధీర్ కి మరదలిగా చేస్తోంది. వీళ్ళిద్దరూ జోడి బాగుంది అంటూ ఇంకో నెటిజన్ కామెంట్ చేసారు. హాలీవుడ్ హీరోయిన్ అంటూ మరొకరు కామెంట్ చేసారు. అష్షు బిగ్ బాస్ కంటెస్టెంట్ గా కూడా వెళ్ళింది. ఈ మధ్య టీవీ షోస్ అలాగే ఫోటో షూట్స్ తో ఎంజాయ్ చేస్తోంది. ఇక అష్షు తన పిక్స్ ని పోస్ట్ చేసుకుని "నువ్వేదో బ్లాక్ మ్యాజిక్ చేసావ్" అంటూ కాప్షన్ పెట్టుకుంది.



## ప్రకృతి అందించిన ఆరోగ్య ప్రదాయిని...

# మందార..



మందార చెట్లు సహజంగానే మన అందరి ఇళ్లలోనూ ఉంటాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దాదాపుగా ప్రతి ఇంట్లోనూ మందార మొక్క ఉంటుంది. ఇవి రంగు రంగుల పూలను పూస్తాయి. అయితే ఎరుపు రంగు రకానికి చెందిన ఒంటి రెక్క మందార పువ్వుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఈ పువ్వులను ఎండబెట్టి వాటిని నీటిలో వేసి మరిగించి డికాషన్‌లా తయారు చేసి తాగవచ్చు. అలాగే మందార ఆకులు కూడా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మందార చెట్టు ఎల్లప్పుడూ పూలను పూస్తూనే ఉంటుంది. దీనికి పెద్దగా పోషణ కూడా అవసరం లేదు. తరచూ కొన్ని నీళ్లను పోస్తే చాలు, చెట్టు చక్కగా పెరుగుతుంది. ఈ చెట్లు మనకు ప్రతి సీజన్‌లోనూ పచ్చగానే కనిపిస్తుంటాయి. మందార పువ్వులను చూడగానే మనస్సుకు ఎంతోఆహ్లాదం కలుగుతుంది. మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది.

**షుగర్, కొలెస్ట్రాల్ సమస్యలకు..:** ఒంటి రెక్క ఎర్ర మందారం పువ్వులలో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఆరోగ్యానికి ఈ పువ్వులు ఎంతో మేలు చేస్తాయి. మందారాలనే హైబిస్కస్ అని కూడా ఇంగ్లిష్‌లో పిలుస్తారు. మందార పువ్వులను కొందరు ఇతర పదార్థాలతో కలిపి తింటారు. ఈ పువ్వులను పలు ఔషధాల తయారీలలో, సౌందర్య సాధన ఉత్పత్తులలోనూ వాడుతారు. మనం ఆరోగ్యంగా ఉండేందుకు మందార ఎంతో మేలు చేస్తుందని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. మందార పువ్వులను యునాని మందుల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ పువ్వులు లేదా ఆకులతో డికాషన్ తయారు చేసి తాగితే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి ఈ పువ్వులు ఎంతో మేలు చేస్తాయి.

**రోగ నిరోధక శక్తికి..:** మందార పువ్వులలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో రక్తపోటు తగ్గుతుంది. హైబీపీ అదుపులో ఉంటుంది. మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధులు ఉన్నవారు, గొంతు సమస్యలు ఉన్నవారు మందార పువ్వులను ఔషధంగా ఉపయోగించవచ్చు. దీంతో ఆయా వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుంది. మందార పువ్వుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. బ్యాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ఈ పువ్వుల్లో క్యాల్షియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది ఎముక లను బలంగా మారుస్తుంది. దంతాలు దృఢంగా ఉండేలా చేస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..:** మందార పువ్వుల్లో పీచు అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. జీర్ణక్రియ మెరుగు పడేలా చేస్తుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్ధకం ఉన్నవారు ఈ పువ్వులతో తయారు చేసిన టీని తాగితే ఎంతో మేలు జరుగుతుంది. ఆయా సమస్యలు తగ్గిపోతాయి. మందార పువ్వుల్లో ఐరన్ అధికంగా ఉంటుంది.

## నెలసరి సరిగ్గా రాని మహిళలు

# ఈ డైట్‌ను ఫాలో అయితే మంచిది..



పూర్వం స్త్రీలకు హార్మోన్ల సమస్యలు అంతగా ఉండేవి కావు. ఒక్కొక్కరు గంపెడు మంది పిల్లలను సహజసిద్ధంగా ప్రసవించేవారు. కానీ ఇప్పటి తరం వారు తీవ్రమైన హార్మోన్ల సమస్యలతో బాధపడుతున్నారు. నెలసరి సరిగ్గా రావడం లేదు. దీంతో సంతాన లోపం సమస్య మహిళల్లో పెరుగుతోంది. అలాగే చాలా లేటు వయస్సులో పెళ్లిళ్లు జరుగుతున్నాయి. దీనికి తోడు పని ఒత్తిడి, ఆహారం వంటి అనేక కారణాల వల్ల మహిళలలో హార్మోన్ల సమస్య ఏర్పడి నెలసరి సరిగ్గా రావడం లేదు. దీనికి తోడు పీసీవోడీ వంటి సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇవన్నీ సంతానం కలిగేందుకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. దీని వల్ల చాలా మంది మహిళలు తమకు సంతానం కలగడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే మహిళల్లో వచ్చే ఈ హార్మోన్ల సమస్యలకు అనేక కారణాలు ఉంటాయి.

**కారణాలు..:** ప్రస్తుతం చాలా మంది స్త్రీలకు థైరాయిడ్ సమస్య వస్తోంది. యుక్త వయస్సులో ఉన్న అమ్మాయిలు థైరాయిడ్ బారిన పడుతున్నారు. ఇది అలాగే కొనసాగుతుండడం వల్ల వారి సంతాన జీవితంపై ప్రభావం చూపిస్తోంది. దీంతో నెలసరి సరిగ్గా రావడం లేదు. అలాగే చాలా మంది ఆహారం, ఇతర కారణాల వల్ల అధిక బరువుతో బాధఫడుతున్నారు. ఇది కూడా హార్మోన్ల సమస్యకు కారణమవుతోంది. పీసీవోఎస్ ఉన్న మహిళల సంఖ్య కూడా పెరుగుతోంది. చాలా మంది మహిళలు పీసీవోఎస్ కారణంగా సంతానాన్ని పొందలేకపోతున్నారు. అయితే ఈ సమస్యలు ఉన్న మహిళలు కచ్చితంగా డాక్టర్‌ను సంప్రదించాలి. వారు తగు పరీక్షలు నిర్వహించి వ్యాధులను నిర్ధారించి అందుకు అనుగుణంగా మందులను రాస్తారు.

**ఆహారం ముఖ్యం..:** వైద్యులు ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడడంతోపాటు ఆహారం విషయంలోనూ మహిళలు జాగ్రత్తలు పాటించాలి. కొవ్వు అధికంగా ఉండే ఆహారాలను, తియ్యని లేదా నూనె పదార్థాలను తినకూడదు. ఇవి బరువు పెరిగేలా చేస్తాయి. దీంతో మందులను వాడి కూడా ప్రయోజనం ఉండదు. హార్మోన్ల సమస్యలు తగ్గవు. కనుక ఆహారం విషయంలో కచ్చితంగా నియమాలను పాటించాలి. అలాగే నెలసరి సరిగ్గా వచ్చేందుకు గాను అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోవాలి. ముఖ్యంగా తాజా ఆకుకూరలను వారంలో కనీసం 3 సార్లు తినాలి. రోజూ ఏవైనా రెండు మూడు రకాల పండ్లను తింటుండాలి. తృణ ధాన్యాలు, చిరు ధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలి. చియా సీడ్స్, అవిసె గింజలు, గుమ్మడికాయ విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలతోపాటు బాదం, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా వంటి గింజలను ఆహారంలో భాగం చేసుకోవాలి.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com